ఐపీఎస్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా విద్యాసాగర్



ఏజీవర్సిటీ: ఇండియాన్ పైటో పాథాలాజికల్ సొసైటీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా బి విద్యాసాగర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఐపీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.కె బిశ్వాస్ నియామక పత్రాన్ని విద్యాసాగర్‌కు అందించారు. గత 75 ఏళ్లుగా సొసైటీ పంటలకు వచ్చే తెగుళ్లపై పరిశోధనలను ప్రోత్సహించి దేశ ఆహార భద్రత కల్పించడమనే లక్ష్యంతో పనిచేస్తున్నది. విద్యాసాగర్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్లాంట్ పాథాలజీ విభాగం అధినేతగా పనిచేస్తున్నారు. అంతేగాకుండ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త జోనల్ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇదే తొలిసారి. దీంతో వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు చిరుధాన్యాల పరిశోధనల శాస్త్రవేత్త జి రాజేశ్ జోనల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.

రామ రాజ్యస్థాపనకు కృషి



రాచూరి రాజశేఖర్

అత్తాపూర్: రామ రాజ్య స్థాపనకు కృషిచేస్తానని రాచూరి రాజశేఖర్ అన్నారు. రామ రాజ్య ప్రశాసన్ అయోధ్య తనకు పదోన్నతి కల్పిస్తూ రామ రాజ్య ప్రశాసన్ జాతీయ ప్రముఖ్‌గా నియమించిందని ఆయన తెలిపారు. ఈ మేరకు జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్ సింగ్ జాతీయ నియామక ప్రశాసక్ భాగేష్, శ్రీవాస్తవ్ నియామక పత్రాన్ని ఈ - మెయిల్ ద్వారా పంపించారని పేర్కొన్నారు. సూచన ప్రతిగా కేంద్ర హోంశాఖ, తెలంగాణ హోంశాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపించారని తెలిపారు. తనకు చాల పెద్ద బాధ్యతను అప్పగించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న పవన్ రాజు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఆర్.పవన్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పవన్ రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో పని చేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు మహిళలు కృషి చేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కోరారు. మండలంలోని పెద్దషాపూర్‌లో మంగళవారం మహిళా సదస్సు నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి భార్య సీతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో బోర్‌వెల్



బోర్ వేయిస్తున్న మార్కండేయనగర్ వెల్ఫేర్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి మార్కండేయనగర్ కాలనీలోని ప్రధాన బోరు ఎండిపోవడంతో కాలనీ ప్రజలతో పాటు ఆలయాలను శుభ్రం చేసేందుకు ఇబ్బంది అవుతున్నది. దీంతో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేశ్ ఆలోచనతో కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు కలిసి రూ. లక్షా 75 వేలు విరాళాలు సేకరించి వీరాంజనేయ ఆలయం ప్రాంగణంలో సోమవారం రాత్రి బోరు వేసి మంగళవారం బోర్‌కు మోటర్ బిగించారు.

దారిదోపిడీ నిందితుల అరెస్టు

మణికొండ: పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ లారీ డ్రైవర్‌ను తమ ఆటోలో ఎక్కించుకుని కొట్టి అతని వద్ద రూ. 5,500లు చోరీకి పాల్పడిన ఘటన నార్సింగిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడకు చెందిన రాజు కోకాపేటలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తన ఓనర్ వద్ద రూ. 5,500 తీసుకుని సాయంత్రం ఏడు గంటల సమయంలో నడుచుకుంటూ కోకాపేట నుంచి నార్సింగి వైపు వస్తున్నాడు. అదే సమయంలో శేరిలింగంపల్లి మండలం, హాఫీజ్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఫారూఖ్, సయ్యద్ మస్తాన్ అతడిని నార్సింగిలో దించుతామని ఆటోలో ఎక్కించుకున్నారు. కొద్ది దూరం వెళ్లగానే కొట్టి సెల్‌ఫోన్, డబ్బును లాక్కుని ఆటోలో నుంచి కిందకు తోసి పారిపోయారు. దాంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, డబ్బును రికవరీ చేసి, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



కల్యాణమహోత్సవానికి ముస్తాబైన మణికొండ పంచవటి రామాలయం

మణికొండ: శ్రీ రామనవమికి ఆలయాలు ముస్తాబయ్యాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు ఆలయాల్లో ఈ నెల 17న నేడు సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు చలువ పందిళ్లు, నీటి సౌకర్యం, కుర్చీలు, మండపాలను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవంలో భాగంగా ముందుగా ఎదుర్కోలు, కల్యాణం, అన్నప్రసాదం, ఊరేగింపు తదితర సేవలు నిర్వహించనున్నారు. మణికొండ పంచవటి కాలనీలోని రామాలయం, శ్రీపార్వతీరామలింగేశ్వరాలయం, మణికొండ క్వార్టర్స్ హనుమాన్, పుప్పాలగూడ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అంజలిగార్డెన్ వీరహనుమాన్, అలకాపూర్ టౌన్ షిప్, నార్సింగి, మంచిరేవుల, నెక్నాంపూర్, ఖానాపూర్, గండిపేట, వట్టినాగులపల్లి, గొలిదొడ్డి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే దేవాలయాల వద్ద అన్న ప్రసాద వితరణలు చేపట్టనున్నారు.



మార్కండేయనగర్‌లో ముస్తాబైన వీరాంజనేయ స్వామి ఆలయం



ముస్తాబైన దేవాలయం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్, టీఎన్జీవోస్ కాలనీ, మధుబన్‌కాలనీ గణేశ్‌నగర్, లక్ష్మీగూడ, ఉడంగడ్డ, గగన్ పహాడ్, ప్రగతినగర్ కాలనీల్లోని ఆలయాలను రంగురంగుల విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఉదయం నుంచే వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు తాగు నీరు, మజ్జిగతో పాటు అన్నదానాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రాజేంద్రనగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి, బుద్వేల్ శివాంజనేయ స్వామి, భగవతిగూడ, బన్సీలాల్‌నగర్, శివరాంపల్లి, వీకర్ సెక్షన్ కాలనీ, ఎర్రబోడ, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవంలో పాటు ఊరేగింపు నేపథ్యంలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఆటిజంను అధిగమించాలి

మణికొండ: పిల్లలు పుట్టుకతోనే ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో పుట్టడంతో వారు ఎంతో కొల్పోతున్నారని, అలాంటి ఆటిజంను అధిగమించి వారిని సామాన్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని బఫెలో వైల్డ్ వింగ్స్ మార్కెటింగ్ హెడ్ సమీన్ హసన్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలోని బఫెలో వైల్డ్ వింగ్స్‌లో స్పెక్ట్రమ్ స్పార్కిల్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో లక్షల మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి అండగా నిలిచేందుకు దేశంలోనే మొదటి మహిళా నేతృత్వంలో తమ సంస్థ అవులెట్‌ను కోకాపేటలో ఏర్పాటు చేశామని తెలిపారు. తమ సంస్థ ఆటిజం పిల్లల తరపున వారికి సంఘంలో సానుకూల మార్పులు సృష్టించేందుకు కృషి చేస్తున్నామని, ఆటిజం పిల్లల్లో తెలివి తేటలు పెంచేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ఆటిజం పిల్లలను ఉత్సాహ పరిచారు.



ఆటలు ఆడుతున్న ఆటిజం పిల్లలు



పిల్లలను ఉత్సాహ పరుస్తున్న మోడల్స్

చలివేంద్రం ప్రారంభం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చౌరస్తాలో కరణం సత్తమ్మ పేరిట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కరణం నారాయణ ముదిరాజ్, రాజు, వెంకటేశ్, గణేశ్, జగదీశ్వర్, శ్రీకాంత్, అర్జున్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదానం

మణికొండ: తలసేమియా రోగులను ఆదుకునేందుకు ఈ నెల 17న (నేడు)బుధవారం రక్తదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు రత్నావలి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంజలి గార్డెన్‌లోని ప్లాట్ నంబర్ 27లో శిబిరం కొనసాగుతుందని ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేసి వారి ప్రాణాలను నిలపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9966309000, 9246801097 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. జలమండలి, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ నీటిని సరఫరా చేయాలని, వాటర్ ట్యాంకర్లు, బోర్‌వెల్ నిర్వహణపై ఎలాంటి అలసత్వం వహించవద్దని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేసే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, మున్సిపల్ ఎస్ఈ శివానంద్, డీజీఎం శ్రీనివాస్, ఏఈఈ రాజ్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎల్లమయ్య, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వాటర్ లైన్‌మెన్లు, జవాన్లు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ తులసీరామ్ వర్ధంతి



తులసీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మాజీ ఎంపీ తులసీరామ్ వర్ధంతిని రాజేంద్రనగర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జయంతి ఉత్సవ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, మాజీ అధ్యక్షుడు గుడిసె యాదయ్య, మాజీ అధ్యక్షుడు పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, శంకర్ రావు మాదిగ, పత్తిరాజు, శ్రీరాములు, జ్యోతి, జంగయ్య, చిన్న బండిరాజు, డాక్టర్ వి.శ్రీరాములు, పెంటయ్య, బచ్చల మహేశ్, నారాయణ ముదిరాజ్, గణేశ్, ప్రసాద్, శ్రీకాంత్, రవి, రమేశ్, నవజ్యోతి, యూత్ క్లబ్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, మంగళవారం శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సు

- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సు
- శని, ఆదివారాల్లో తరగతులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా ఈ కోర్సును ఏర్పాటు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును వినూత్న బోధనా విధానం ద్వారా బోధించేలా ఏర్పాట్లు చేయడం విశేషం. ఈ కోర్సు తరగతులను ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉండేలా శని, ఆదివారాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. వినూత్న బోధనా విధానం నుంచి ప్రయోజనం పొందేందుకు వ్యక్తిగత తరగతులు పనిచేసే నిపుణులకు సహాయపడతాయని హెచ్‌సీయూ అధికారులు ప్రకటించారు. ఇంటరాక్టివ్ లెక్చర్ మెథడ్స్‌తోపాటు హర్వర్డ్, సేజ్ నుంచి వచ్చిన కేసులను ఉపయోగించి పరిశ్రమకు సంబంధించిన సిలబస్ బోధించబడుతుంది. ఈ కోర్సులు స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, విశ్వవిద్యాలయంలోని ఇతర విభాగాల నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన కోర్సులను ప్రీమియర్ బిజినెస్ స్కూళ్ల నుంచి అధ్యాపకులు, పరిశ్రమకు చెందిన అభ్యాసకులు బోధిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమ పీడీఎస్ బియ్యం పట్టుకున్న దృశ్యం

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని అత్తాపూర్ పిల్లర్ 162 వద్ద గోదాములో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకున్నాయి. పక్కా సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించి బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకోవడం పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో రంగారెడ్డి జిల్లా డీఎస్‌వో ఎంకే రాథోడ్, సరూర్‌నగర్ ఏఎస్‌వో, టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఆదివారం మహిళల కోసం ప్రత్యేకంగా 'సండే ఈవినింగ్ టాక్' ను ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కేన్సర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి. రఘురామ్ ప్రత్యేక ఉపన్యాసం ఉంటుందన్నారు.

యథేచ్ఛగా బోర్లు..!



పద్మశ్రీహిల్స్‌లో బోరు వేస్తుండడంతో రోడ్డుపై దట్టంగా కమ్ముకున్న దుమ్ము

బండ్లగూడ: అసలే వేసవి కాలం నీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే కొంతమంది మాత్రం యథేచ్ఛగా ఇండ్ల మధ్యంలోనే అక్రమంగా బోర్లు వేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. అయినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీ హిల్స్‌లో రోజు రోజుకూ బోర్లు వేసే వారి సంఖ్య పెరిగిపోతుంది. ఇంటి నిర్మాణం కోసం అంటూ యథేచ్ఛగా బోర్లు వేసుకుంటున్నారు. కాలనీలోని ఓ ఇంటి యజమాని బోరు వేయడంతో దుమ్ముతో ఎదురుగా వచ్చేవి కూడా కనిపించని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా బోర్లు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలి'



ఫిర్యాదు ప్రతులను చూపిస్తున్న పాపారాయుడు

శంషాబాద్: మున్సిపాలిటీలో పారిశుధ్యం, ఇంజినీరింగ్, అకౌంటింగ్ తదితర విభాగాల్లో కొందరు పాలకవర్గ సభ్యులు, అధికారులు తమకు అనుకూలంగా ఐదుగురు వ్యక్తులను అవుట్ సోర్సింగ్ విధానంలో అక్రమంగా నియమించుకున్నారని పట్టణానికి చెందిన సామాజిక వేత్త పాపారాయుడు ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆ వివరాలను మంగళవారం వెల్లడించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ విధానాలపై తాను రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి, డైరెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశానని తెలిపారు. ప్రజాప్రతినిధులకు అనుకూలంగా సంబంధిత ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పారిశుధ్య విభాగంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆధారాలతో చూపించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత ఉద్యోగుల నియామకాల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ విషయాలన్నింటిని పొందుపర్చి ఉన్నతాధికారులకు వినతి అందజేశానన్నారు. అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి శరత్‌చంద్ర



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


- స్వీప్ నోడల్ అధికారి శరత్‌చంద్ర
- సీబీఐటీలో విద్యార్థులకు అవగాహన

మణికొండ: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు అర్హులందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో మంగళవారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం, రాష్ట్రం ఎవరితో అభివృద్ధి చెందుతుందనే అవగాహనను పెంచుకుని ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, డబ్బులు తీసుకోకుండా మంచి వ్యక్తి, పార్టీలకు ఓటు వేసి మంచి సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికల్లో తప్పనిసరి ఓటు వేస్తానని, మంచి వ్యక్తిని ఎన్నుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఈ నర్సింహరాజు, మేనేజర్ యోగేష్, సహాయ ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కో ఆర్డినేటర్ జీఎస్ఆర్ ప్రసాద్, సభ్యులు కౌశిక్, సుప్రియ, హేమంత్, దిగ్న, నీరజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-మెయిల్ సెక్యూరిటీపై వెబినార్



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సెంటర్ ఆధ్వర్యంలో ఇంటర్నెట్ అండ్ ఈ -మెయిల్ సెక్యూరిటీపై మంగళవారం నిర్వహించిన వెబినార్‌ను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వాటి బారిన పడకుండా ఉండేందుకు ఈ వెబినార్‌లు ఎంతో దోహదపడుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సి-డాక్‌కు చెందిన ప్రాజెక్టు మేనేజర్ ఎం జగదీశ్ బాబు ఇంటర్నెట్ అండ్ ఈ మెయిల్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఫేక్ మెసేజ్‌ల నుంచి ఎలా కాపాడుకోవాలో సూచించారు. ఈ మెయిల్స్‌కు వచ్చే జంక్, స్పామ్ మెసేజ్‌ల నుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని అన్నారు. ఫేక్ యూఆర్ఎల్‌లను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ ప్లాట్ ఫాం లను వివరించారు. వెబినార్‌లో దాదాపు 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా స్థానాలు, కళాశాలల నుంచి పాల్గొన్నారు. ఇంటర్నెట్ ఆవశ్యకతను కంప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జి యూనివర్సిటీ గ్రంథ పాలకుడు డాక్టర్ ఎస్‌పీ రవికుమార్ వివరించారు.



బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: 'బూత్ మహాజన సంపర్క్ అభియాన్'లో భాగంగా రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లో బూత్ నంబర్ 158,159, 160లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని మోదీకి కానుకగా ఇచ్చేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ, డివిజన్ కార్యదర్శి పెండ్యాల సురేందర్, యువమోర్చా అధ్యక్షుడు రాపర్తి రాకేశ్ గౌడ్, బూత్ అధ్యక్షులు పవన్, సందీప్, అక్షిత్ గౌడ్, బాలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేబీ.దొడ్డి వాసి లక్ష్మణ్ (40) సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించగా.. అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

భార్య, బంధువులపై అనుమానం..

లక్ష్మణ్ మృతిపై కుటుంబ సభ్యులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతని భార్య, వరసకు వదిన అయ్యే మహిళ, మరో వ్యక్తిపై అనుమానాలు ఉన్నాయంటున్నారు. రాత్రి మద్యం మత్తులో ఉన్న అతని మర్మాంగాలను గాయపర్చి చంపేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు పారదర్శకంగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలాఉంటే పోలీసులకు సమాచారం వెళ్లకుండా కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు మృతదేహానికి త్వరగా అంత్యక్రియలు నిర్వహించేందుకు పూనుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. చివరి సమయంలో పోలీసులు ఎంట్రీ ఇవ్వడంతో సీన్ మారిపోయింది. ఇదిలా ఉండగా.. పోస్టుమార్టం రిపోర్టు వస్తే నిజాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతానికి అనుమానాస్పద కేసుగా విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.